
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 25 । మే । 2023



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి శ్రీధర రామకృష్ణ, భానుమతి దంపతులు (అమెరికా) ఆన్‌లైన్ ద్వారా బుధవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 11,662 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.45 అడుగులకు చేరింది.

గరిష్ఠం/కనిష్ఠం
42.5° / 27.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.5	29.0
కాకినాడ	38.9	28.3
అమలాపురం	39.8	27.0

న్యూస్‌రీల్

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.27.97 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 55 రోజులకు స్వామి వారికి రూ.27.97 లక్షల ఆదాయం సమకూరింది. అమలాపురం ఎండోమెంట్స్ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. హుండీల్లో 7.500 గ్రాముల బంగారం, 110.500 గ్రాముల వెండి వస్తువులను భక్తులు కానుకలుగా వేశారని ఈఓ డి.శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి రూ.20.11 లక్షల రాబడి



అమ్మవారి ఆలయంలో జరుగుతున్న హుండీలు లెక్కింపు

ఆలమూరు: చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు పర్యవేక్షణలో దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది, జొన్నాడ, అనపర్తి, చింతలూరు గ్రామ సేవా సమాజ సభ్యులు తదితరులు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు యాజమాన్యం సమక్షంలో ఆలయంలోని తొమ్మిది హుండీలను తెరచి, ఆదాయం లెక్కించారు. 45 రోజులకు అమ్మవారికి రూ.20,11,661 ఆదాయం లభించింది. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు అందించాలని ఈఓ వీర్రాజు విజ్ఞప్తి చేశారు.

27 నుంచి పుష్ప-2 షూటింగ్



రాంబాబు కుటుంబంతో దర్శకుడు సుకుమార్ దంపతులు

అమలాపురం టౌన్: ఈ నెల 27, 28, 29 తేదీల్లో మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో పుష్ప-2 సినిమా షూటింగ్ నిర్వహిస్తున్నామని దర్శకుడు సుకుమార్ తెలిపారు. షూటింగ్ సన్నాహాల్లో ఉన్న సుకుమార్, ఆయన భార్య తబిత కలిసి అమలాపురంలోని తన స్నేహితుడు, పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు ఇంట బుధవారం సందడి చేశారు. సుకుమార్, రాంబాబు విద్యార్థి దశ నుంచీ స్నేహితులు. ఒకే క్లాసు, ఒకే వసతి గదిలో చదువుకున్నారు. రాంబాబు, ఆయన భార్య శ్రీదేవి, కుమారుడు యశ్వంత్‌తో సుకుమార్ దంపతులు సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: రాష్ట్రంలోని 162 ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఎంపీసీ/బైపీసీ/ఎంఈసీ/సీఈసీ గ్రూపుల్లో ఉచిత విద్య పొందాలనుకునే విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధించే మోడల్ స్కూల్స్‌లో ఎటువంటి ఫీజులూ వసూలు చేయరని తెలిపారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలు హెటీటీపీఎస్://ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ లేదా సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయని తెలిపారు. జూన్ 7వ తేదీ వరకూ నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డులతో గేట్‌వే ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించిన వారికి ఒక జనరల్ నంబర్ కేటాయిస్తారన్నారు. ఆ నంబరు ఆధారంగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 చొప్పున చెల్లించాలన్నారు. అడ్మిషన్లలో పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారని తెలిపారు. వివరాలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ను లేదా సంబంధిత డీవైఈఓ/ఎంఈఓలను సంప్రదించాలని డీఈఓ కమల కుమారి సూచించారు.



కొవ్వూరు సభకు అశేషంగా తరలివచ్చిన విద్యార్థులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్నా..

గోదారి తీరాన విద్యార్థి ఉప్పెన

గోదావరి తీరాన విద్యార్థి ఉప్పెన ఎగసింది. తమ బతుకులకు.. బంగారు భవితను త్రికరణ శుద్ధిగా లిఖిస్తున్న జగన్ మావయ్యను కళ్లారా చూసేందుకు విద్యార్థులు మహాప్రవాహంలా తరలివచ్చారు. తమ భవిష్యత్తును నిర్దేశించే ఆయన ప్రసంగానికి కరతాళధ్వానాలతో మద్దతు పలికారు. 'మా నమ్మకం నువ్వే జగనన్నా' అంటూ ఎలుగెత్తి చాటారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభకు వేలాదిగా విద్యార్థులు, ప్రజలు తరలివచ్చారు. సభా ప్రాంగణం బయట సైతం ఎండను లెక్క చేయకుండా పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు నిలుచుని, సీఎం ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించి, ఆనందంతో కేరింతలు కొట్టారు.

- సీఎం వైఎస్ జగన్‌కు నీరా'జనం'
- కొవ్వూరు బహిరంగ సభకు పోటెత్తిన విద్యార్థులు
- ఘన స్వాగతం పలికిన అభిమానులు, పార్టీ శ్రేణులు
- అడుగడుగునా బ్రహ్మరథం
- తల్లుల ఖాతాల్లో జగనన్న విద్యా దీవెన నిధులు జమ చేసిన ముఖ్యమంత్రి

సాక్షి, రాజమహేంద్రవరం/కొవ్వూరు: జగనన్న విద్యా దీవెన పథకం కింద 2023 జనవరి – మార్చి త్రైమాసికానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేసేందుకు.. బుధవారం కొవ్వూరు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి విద్యార్థులు, ప్రజలు అడుగడుగునా ఆనందోత్సాహాలతో నీరా'జనం' పట్టారు. తాడేపల్లిలోని నివాసం నుంచి సీఎం జగన్ కొవ్వూరులోని బుద్ధుడి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం చేరుకున్నారు. అక్కడ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి 2 కిలోమీటర్లకు పైగా రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోలో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సీఎం బస్సుపై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వారందరికీ చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం పట్టణంలోని సత్యవతి నగర్‌లో ఏర్పాటు చేసిన సభా స్థలికి చేరుకున్నారు. తొలుత జగనన్న విద్యా దీవెన పథకం లబ్ధిదారులైన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారితో గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

హోరెత్తిన 'జై జగన్' నినాదాలు

సీఎం జగన్ ప్రసంగించేందుకు మైక్ చేత పట్టగానే విద్యార్థులందరూ ఒక్కసారిగా లేచి 'జై జగన్' అని పెద్ద ఎత్తున నినదించారు. 40 నిమిషాల పాటు సాగిన సీఎం ప్రసంగంలో అడగడుగునా నినాదాలు హోరెత్తాయి. 'ప్రతిభ మీది.. మీ ఉన్నత విద్య బాధ్యత నాది'..

- మిగతా 8లో



ప్రియనేతకు 'సుమ' స్వాగతం : కొవ్వూరు రోడ్ షోలో సీఎం జగన్‌కు పూల జల్లులతో ప్రజల స్వాగతం

కొవ్వూరుకు వరాల జల్లు

కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. నియోజకవర్గ అభివృద్ధి పనులను హోం మంత్రి తానేటి వనిత ప్రస్తావించగా.. సీఎం వెంటనే ఆమోదం తెలిపి నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కొవ్వూరులో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, కొవ్వాడ కెనాల్ వద్ద కల్వర్ట్ నిర్మాణం, మూడు మండలాల్లో మూడు అంబేడ్కర్ భవనాలు, ముస్లింలకు షాదీఖానా, ఎస్సీలకు కమ్యూనిటీ హాలు, కాపు కల్యాణ మండపం నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

జగనన్న పాల వెల్లువతో ఆర్థిక వృద్ధి

- సహకార డెయిరీలను బలోపేతం చేయాలి
- ఏపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ అహ్మద్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న అహ్మద్ బాబు. చిత్రంలో కలెక్టర్ శుక్లా

అమలాపురం టౌన్: జగనన్న పాల వెల్లువ పథకంతో మహిళల ఆర్థిక పరిపుష్టికి బాటలు పడతాయని ఏపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ అహ్మద్ బాబు అన్నారు. జిల్లా వ్యవసాయ, పశు సంవర్ధక, రెవెన్యూ, పంచాయతీరాజ్, సహకార, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులకు కలెక్టరేట్‌లో బుధవారం ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఈ పథకంపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో పాల దిగుబడి, నాణ్యత మిగతా రాష్ట్రాలతో పోల్చితే అధికంగా ఉందని చెప్పారు. అయితే నాణ్యమైన పాలకు మంచి ధర రావడం లేదని తెలిపారు. సహకార రంగాన్ని బలోపేతం చేస్తే పాల ఉత్పత్తులకు అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఇదే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాలు వెల్లువ పథకాన్ని తీసుకు వచ్చిందని అహ్మద్ బాబు వివరించారు. ఈ పథకం కింద ఎటువంటి ష్యూరిటీలూ లేకుండా మహిళా పాడి రైతులకు రూ.30 వేల వర్కింగ్ క్యాపిటల్ అందిస్తోందన్నారు. అలాగే ఎలాంటి ష్యూరిటీలూ లేకుండా పాలు పోసే రైతులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా పాడి పశువుల కొనుగోలుకు రూ.1.6 లక్షల వరకూ రుణాలు అందిస్తారని తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా మహిళలు ఏవిధంగా ఆర్థికంగా నిలదొక్కుకోగలరో వివరించారు.

పేద పిల్లల ఉన్నత చదువుకు బాసట

- జగనన్న విద్యా దీవెనతో వారికి మేలు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- జిల్లాలో 25,694 మంది విద్యార్థులకు రూ.23.64 కోట్ల లబ్ధి



జగనన్న విద్యా దీవెన నమూనా చెక్‌ను విద్యార్థులకు, వారి తల్లులకు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రజాప్రతినిధులు, అధికారులు

అమలాపురం టౌన్: ఉన్నత చదువులతో పేద విద్యార్థులు అత్యున్నత స్థానాలకు వెళ్లేందుకు జగనన్న విద్యా దీవెన పథకం ఎంతో బాసటగా నిలుస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో బుధవారం ఉదయం జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం నిధులను వారి తల్లుల బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. జిల్లాలో ఈ పథకం కింద మొత్తం 25,694 మంది విద్యార్థులకు రూ.23.64 కోట్ల నిధులు విడుదలయ్యాయని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో లబ్ధి పొందిన వారిలో 297 మంది ఎస్సీ, 171 మంది ఎస్టీ, 13,703 మంది బీసీ, 2,605 మంది ఈబీసీ, 296 మంది ముస్లిం, 8,466 మంది కాపు, 156 మంది క్రిస్టియన్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. లబ్ధిదారులైన విద్యార్థులు, వారి తల్లులకు కలెక్టర్ శుక్లాతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు రూ.23.64 కోట్ల నమూనా చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, అమలాపురం, ఉప్పలగుప్తం జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, గెద్దం సంపదరావు, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జ్యోతిలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఇళ్ల బాట

- అడ్మిషన్ల కోసం విద్యార్థుల ఇంటి తలుపులు తడుతున్న టీచర్లు
- ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని సూచన
- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన
- జిల్లాలో జోరుగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



అడ్మిషన్లకు విద్యార్థుల ఇళ్ల బాట పట్టిన ఐ.పోలవరం మండలం వద్దిచెరువు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు

రాయవరం: మరో రెండు వారాల అనంతరం వేసవి సెలవులు ముగియనున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో విద్యార్థులను ఆయా తరగతుల్లో చేర్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వారి ఇళ్ల బాట పట్టారు. వారి వారి క్యాచ్‌మెంట్ ఏరియాలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, ఆయా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సిందిగా తల్లిదండ్రులను కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర విద్యా శాఖ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించే పని జిల్లాలో వేగంగా సాగుతోంది. అడ్మిషన్ల ప్రక్రియను జిల్లా విద్యా శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ బడుల్లో ఒకటో తరగతిలోను, 5, 7 తరగతుల్లో ఉత్తీర్ణులైన వారిని సమీప ఉన్నత పాఠశాలల్లో పై తరగతుల్లోను చేర్పించాలని జిల్లా విద్యా శాఖ లక్ష్యంగా నిర్దేశించింది. అలాగే పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, +2 పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రణాళిక ప్రకారం అడుగులు వేస్తున్నారు.

ఇదీ లక్ష్యం

- జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన వారు, పలు ప్రైవేటు పాఠశాలల్లో యూకేజీ చదువుతున్న వారు కలిపి మొత్తం 18,520 మంది చిన్నారులున్నట్లు గుర్తించారు. వీరందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పించాలని విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చురుకుగా సాగుతోంది.
- అలాగే గత విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లో 22,426 మంది విద్యార్థులు ఐదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. వీరందరూ డ్రాపౌట్ కాకుండా ఈ విద్యా సంవత్సరంలో ఏదో ఒక పాఠశాలలో ఆరో తరగతిలో చేరాల్సి ఉంది.
- గత విద్యా సంవత్సరంలో 7వ తరగతి 21,102 మంది, 8వ తరగతి 20,549 మంది ఉత్తీర్ణులయ్యారు.
- అలాగే, ఈ ఏడాది జిల్లాలో పదో తరగతి పరీక్షలు 19,550 మంది రాయగా, 13,915 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్నారు. తొలి విడతలో రెగ్యులర్‌గా పాసయిన విద్యార్థులు ఇంటర్మీడియెట్, +2 పాఠశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర కోర్సులలో చేరనున్నారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు కూడా కూడా ఇంటర్మీడియెట్, +2 పాఠశాలల్లో అడ్మిషన్లు పొందాల్సి ఉంటుంది.

ప్రయోజనాలను వివరిస్తూ..

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వలన విద్యార్థులకు ఒనగూడే ప్రయోజనాలను వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో వివరిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు నాడు – నేడు పథకంలో ఆధునీకరణ చెందడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా జగనన్న విద్యా కానుక ద్వారా మూడు జతల యూనిఫాం, స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, సాక్సులు, బెల్టు ఉచితంగా అందించడాన్ని వివరిస్తున్నారు. అలాగే జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రోజుకో విధమైన మెనూ, వారానికి ఐదు కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావ వంటి పోషకాహారాన్ని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేస్తున్నారు. వీటితో పాటు విద్యార్థి పాఠశాలకు వచ్చినప్పటి నుంచి తిరిగి ఇంటికి వెళ్లేంత వరకూ విద్యాశాఖ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఇతర సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యా బోధన, ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఘన విజయాలను వివరిస్తూ, తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు చైతన్యపరుస్తున్నారు.

జిల్లాలో చిన్నారుల వివరాలు :

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులు	10,758
బాలురు	5,383
బాలికలు	5,375
ప్రైవేటు పాఠశాలల్లో యూకేజీ చదువుతున్న వారు	7,762
వీరిలో బాలురు	4,023
బాలికలు	3,739
మొత్తం	18,520

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపడుతున్నాం



ప్రతి పాఠశాల పరిధిలోని ఉపాధ్యాయులు, ఆయా పాఠశాల పరిధిలోని సెన్సస్ రిజిస్టర్ అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశాలిచ్చాం. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు చర్యలు చేపడుతున్నాం. ఉపాధ్యాయులు వారి వారి క్యాచ్‌మెంట్ ఏరియాల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ వేగంగా సాగుతోంది.

– నాయుడు రామచంద్రరావు, ఎంఈఓ, మండపేట

ఎప్పటికప్పుడు సమీక్ష



బడి ఈడు చిన్నారులందరినీ పాఠశాలల్లో చేర్పాల్సిందిగా ఆదేశాలిచ్చాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ మండలాల వారీగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై సమీక్షిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి



సభా వేదికపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

జగనన్నకు జై

వరదల వేళ ఇరు తీరాలనూ ఒరుసుకుంటూ పరవళ్లు తొక్కే అఖండ గోదావరి సైతం చిన్నబోయేలా.. ఆ నదీ తీరాన ఉన్న కొవ్వూరులో జనవాహిని ఉరకలెత్తింది.. విద్యార్థి కెరటం ఎగసిపడింది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగమించిన వేళ.. పట్టణంలో ఎటు చూసినా జనప్రవాహమే.. పట్టణంలో ఎక్కడ చూసినా సమూహాలుగా ఉన్న విద్యార్థులే.. జగనన్న విద్యా దీవెన పథకం నిధులను విడుదల చేసేందుకు బుధవారం కొవ్వూరు వచ్చిన తమ ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విద్యార్థులతో పాటు అశేషంగా తరలివచ్చిన ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. సభా ప్రాంగణంలోని గ్యాలరీలన్నీ విద్యార్థులతో, జనంతో నిండిపోయాయి. నింగిన సూరీడు మండిపోతున్నా లెక్క చేయకుండా.. సభా ప్రాంగణం బయట సైతం పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు నిలుచుని, సీఎం ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించి, ఆనందంతో కేరింతలు కొట్టారు.

- సాక్షి, రాజమహేంద్రవరం


అదిగదిగో.. ఆయనే: సీఎం జగన్‌ను చూసి ఇంట్లో నుంచి ఆనందంతో చేతులూపుతున్న ఓ కుటుంబం


ఆనంద గోదారి: అన్నను చూసిన వేళ మురిసిపోతున్న చెల్లెమ్మలు


నీ రాక కోసం..: సీఎం జగన్ వచ్చిన వేళ సెల్ ఫోన్లలో ఫొటోలు తీసుకుంటూ.. నిండైన ఆనందంతో స్వాగతిస్తున్న చెల్లెమ్మలు


మా గుర్తుగా..: జ్ఞాపిక అందజేస్తున్న మంత్రులు తానేటి వనిత, వేణు తదితరులు


అన్న వచ్చిన వేళ.. ఆనంద హేల


జయహో జగనన్నా..: విద్యార్థినుల ఆనందోత్సాహం


ఇసుక వేసినా రాలనంతగా..: కొవ్వూరులో జన గోదారి


ఉత్సాహ తరంగాలై..: సీఎంను చూసి ఉరకలెత్తిన విద్యార్థి లోకం

మండుటెండలో బండిపై జనం వద్దకు..

పిఠాపురం: సాధారణంగా ప్రజాప్రతినిధులంటే అధికారులు.. మందీమార్బలంతో హడావుడిగా వస్తుంటారు. కానీ పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం అవేమీ లేకుండా ఒంటరిగా మండుటెండలో బండిపై తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో పర్యటించారు. ఇళ్లకు వెళ్లి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన అనుకోకుండా తమ ఇళ్లకు రావడంతో నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు. 'ఇలా ఇంటికి వచ్చి అడిగిన నాయకుడు మీరే' అంటూ తమ సమస్యలు చెప్పుకుని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


సమస్యలు తెలుసుకోవడానికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

గోదారి తీరాన విద్యార్థి ఉప్పెన

7వ పేజీ తరువాయి ▶

'నేను విన్నాను.. నేను ఉన్నాను' అని సీఎం చెప్పగానే విద్యార్థుల చప్పట్లు, ఈలలు, కేకలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. తమ భవిష్యత్తుకు భరోసా దొరికిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. 'కులం చూడం.. మతం చూడం' అనగానే హర్షాతిరేకాలతో సీఎంకు అభినందనలు తెలిపారు.

తమ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న విధానాన్ని వివరించగానే తమ బిడ్డ జగన్ తమకు చేస్తున్న మేలును పలువురు గుర్తు చేసుకున్నారు. «మీ బిడ్డను ఎదిరించేందుకు తోడేళ్లన్నీ ఒక్కటవుతున్నాయి. రాబోయే కురుక్షేత్రంలో మీరు అండగా నిలవాలి» అని జగన్ పేర్కొనగానే ప్రజలు, మహిళలు ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. ఎందరు వచ్చినా తమ బిడ్డ, అన్న, తమ్ముడు జగన్‌ను కాపాడుకుంటామని నిండైన మనసుతో ప్రతినబూనారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం జగన్ వివరిస్తుంటే కరతాళధ్వనులు, ఈలలు, కేకలతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. ప్రసంగం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 9.95 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.703 కోట్ల జగనన్న విద్యా దీవెన నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు. ఇందుకు సంబంధించిన డెమో చెక్కుతో గ్రూప్ ఫొటో దిగారు. ఈ సందర్భంగా సీఎంకు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు జ్ఞాపికలు అందజేశారు. శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సభా ప్రాంగణం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం.. అక్కడ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం తాడేపల్లిలోని నివాసానికి బయలుదేరిన ముఖ్యమంత్రికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, పినిపే విశ్వరూప్, తానేటి వనిత, బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావ్, చిర్ల జగ్గిరెడ్డి, జి.శ్రీనివాస్ నాయుడు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కొండేటి చిట్టిబాబు, వాసుబాబు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వంకా రవీంద్ర, కౌరు శ్రీనివాసరావు, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎస్.మణికుమారి, భూదాన బోర్డు చైర్మన్ విజయభాస్కరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఆర్డీఓలు ఎ.చైత్రవర్షిణి, ఎస్.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లు తెప్పించిన విద్యార్థిని ప్రసంగం

సీఎం సభలో బీకామ్ విద్యార్థిని దివ్య చేసిన ప్రసంగం సభికులను కన్నీరు పెట్టించింది. "మా అమ్మ మూగ, చెవిటి. తండ్రి పెరాలిసిస్‌తో దివ్యాంగుడు. ఇద్దరం ఆడపిల్లలం. అలాంటి పరిస్థితుల్లో మా చదువులు ఎలాగని భయపడ్డాం. దేవుడిలా మీరొచ్చి అమ్మ, నాన్నకు పెన్షన్ ఇస్తున్నారు. నేను కార్పొరేట్ కళాశాలలో ఇంగ్లిష్ మీడియంలో డిగ్రీ చదువుకునేందుకు ఫీజు మొత్తం చెల్లించి మా కుటుంబానికి 'నేనున్నా'నంటూ భరోసా ఇచ్చారన్నా" అంటూ దివ్య భావోద్వేగానికి గురైంది. మీకు జీవితాంతం రుణపడి ఉంటామన్నా అని వేదన, కృతజ్ఞత నిండిన స్వరంతో చెప్పింది. సభలో ఆమె కన్నీరు పెట్టుకోవడం చూసిన అక్కడి విద్యార్థులు, ప్రజల కళ్లు చెమర్చాయి.

జగనన్న సమన్యాయానికి నేనే నిదర్శనం

జగనన్న ప్రభుత్వంలో కుల, మత, జాతి విభేదాల్లేవు. అందరికీ సమన్యాయమే జగనన్న లక్ష్యం. అందుకు నేనే నిదర్శనం. దళితులకు ధైర్యం జగనన్న. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటు పడుతున్న నాయకుడు జగనన్న. గిరిజనుల గుండెచప్పుడు, మైనార్టీలకు అండ, బలహీనులకు బలం, ఐదు కోట్ల ఆంధ్రుల నమ్మకం జగనన్న. ఓట్లు ముఖ్యం కాదు చదువులు కావాలని విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్ స్థాయికి చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. హిస్టరీ చదివుంటారు.. వినుంటారు.. కానీ హిస్టరీ క్రియేట్ చేసిన నాయకుడిని ఎప్పుడైనా చూశారా? ఆయనే మన జగనన్న. విద్యను పేదవాడి హక్కుగా మార్చితే ప్రతిపక్షాలు చూడలేకపోతున్నాయి.

- తానేటి వనిత, హోం మంత్రి

జిల్లాలో 23 వేల మందికి లబ్ధి

తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా జగనన్న విద్యాదీవెన పథకంలో 23 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. వారి తల్లుల ఖాతాల్లో రూ.23.25 కోట్లు జమ అవుతున్నాయి. పేదరికాన్ని అధిగమించి, ఉన్న స్థానాలు అధిరోహించాలంటే విద్య ఒక్కటే మార్గమని గుర్తించిన సీఎం జగన్.. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, నాడు - నేడు వంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ఇది ఎంతో తోడ్పాటునిస్తుంది.

- కె.మాధవీలత, కలెక్టర్, తూర్పు గోదావరి